# ఋతువు

- సత్యమూర్తి



మంచు మండినట్టు మండి హఠాత్తుగా చల్లబడి ఆమె నా కౌగిల్లోంచి పెనగి, విడీ విడివడ నట్టు విడి, విడిపించుకొనే అస్పష్ట ప్రయత్నంలో ఆగి నా కళ్ళల్లోకి రెండు చూపుల కత్తుల్ని తురిమి... నా కళ్ళు ప్రదవించబోతే తన రెండు అరచేతుల్తో చటుక్కున నా మొహాన్ని అదిమి... నా పెదవుల మీద సుతారంగా తన పెదవుల్తో అమృతాన్ని అద్ది... నా ఆత్మ చిట్లిపోతుంటే... చిన్న నవ్వుతో ఆపి... జుట్టులోకి వేళ్ళు జొనిపి... గుండెల కేసి అదుముకొని...

"ఏడిస్తే నీ కళ్ళు నీలాలు కారు" రాగయుక్తంగా అని... కాసేపు నిశ్శబ్దం తర్వాత ఆ పేజీ తిప్పి...

"నువ్వు గొప్పవాడివనుకున్నాను" అంది... ఎక్కడో ఓ కోయిల దుఃఖభారంతో గొంతు గాద్గదికమై పెనుగులాడుతుంది గానించడానికి.

"ప్రపంచంలాగే నువ్వూ అనుకుంటే ఎలా?" గొణిగాను. ఆమె చటుక్కున నా తల పైకెత్తి "అయితే నువ్వు ప్రపంచానికి ఒకరివి, నాకు మరొకరివా?"

నేను నవ్వాను—

ఆమె ఆలోచించినట్టు చూసి చూసినట్టు ఆలోచించి —

"మరి... మరి - నేనే నీ ప్రపంచం అన్నావ్—"

గొప్ప తెలివితేటల్లోంచి ధ్వనించిన అమాయకపు గొంతు...

ఈసారి నేను ఆమె జుట్టు పట్టుకొని, ప్రేమ కోపంగా చూసి ఆమె మొహాన్ని ఇంకా దగ్గరకు లాక్కొని –

"ప్రపంచాలు పలు రకాలు. నువ్వో ప్రపంచం, నువ్వే నా ప్రపంచం" నవ్వాను—

ఒక అర్ధక్షణం గొంతు సవరించుకున్న ఆ కోయిల పాట విని - నవ్వి - నా చేతుల్లో వున్న తన జుట్టును తన చేతుల్లో పట్టుకొని - నా మొహానికేసి కొట్టి, మళ్ళీ నా పెదవుల మీద చక్కెర అద్ది...

హఠాత్తుగా నన్ను వదిలి లేచి నిలబడి,

"నే వెళతాను" అంది - కోయిల గొంతు మళ్ళీ కొరబోయింది.

నా చేతుల మధ్య నలుగుతున్న ఆమె చేతులు విడిపించుకోడానికి చేసే ప్రయత్నం నాకు చేదుగా వుంది... నా చేతులు ఇంకా బిగించాను... "వదులు" ఆమె గొణిగింది - ఆ గొంతులో కదలాడే చిన్న ఆర్ద్రత ఎప్పుడూ నన్ను పులకరింపచేస్తుంది - నా కళ్ళలో ఏదో వెతుకుతుంది ఆమె...

అక్కడేమీ దొరకదు... వెన్నెల, చీకటి పెనుగులాటలో - చిరుగాలిని జారవిడుచుకున్నాయి... అది కిటికీ రెక్క మీద చిన్నగా పగిలి, ఆ ముక్కలు ఆమె జుట్టులో కదిలి... నేను కళ్ళు మూసుకొని - తల కొద్దిగా పైకెత్తాను. చెంప ఒక పక్కకు వంచి—

రెండు క్షణాల మృత నిశ్శబ్దం. ఆమె వూపిరిలో కదిలి... నా చెంప మీద నులివెచ్చని పెదవుల స్పర్శతో అమృతించి... ... ...కోయిల రెచ్చిపోతోంది. రెండో చెంప వంచాను... ...అమృతపు సెలయేళ్ళ పాటలు...

ఈసారి - మొహం కాస్త పైకెత్తి పెదవులు...

అమరత్వపు జలపాత పతనం... కోయిలకు పిచ్చెక్కి...

నా రెండు చేతుల్లో వున్న ఆ రెండు చేతుల్నీ వదిలి - చటుక్కున ఆమె నడుముచుట్టూ చుట్టి కళ్ళు తెరిస్తే... ఆమె నవ్వి — "వదులు" అంది.

ఆ నవ్వులో చిన్న కోపం వుంది... నా చేతులు ఆమెను వదిలే ప్రయత్నం చేయడం లేదు... ఆమె పెదవుల్లో నవ్వు కోపంగా కళ్ళలోకి ప్లావితమవుతోంది — నా చేతులు ఇంకా బిగుసుకొంటున్నాయి. ఆమె మొహంలో నవ్వుపూర్తిగామాయమై, దయని వర్షించే కళ్ళు చిన్నగా ఎర్రబడి... నా చేతుల్ని బలవంతంగా విడదీసుకొని - విసిరికొట్టి దూరంగా వెళ్ళి నిలబడి కోపం వల్ల వేగంగా చలిస్తున్న వూపిరి అదుపులోకి తీసుకొని విసురుగా బయటికెళ్ళిపోయింది — కోయిల గొంతు జీరబోయింది...

ఆమె పరిచయపు గతం "క్షణంలా" నా హృదయంలో మెరిసింది

* * *

ప్రశాంతత ప్రపంచంలో ఎక్కడా దొరకదని, అది మనతోనే మనసులోనే వుంటుందని, ఊటీ వెళ్ళి హోటల్ గదిలో దాక్కున్న పది రోజులకి అర్థమై... విసుగొచ్చి, ఆ హోటల్ లాన్‌లో దూరంగా ఓ చెట్టుకి చేరబడి, ఊటీ చలిని విస్కీతో వెచ్చబెట్టుకుంటున్నాను... చీకటి మేలి ముసుగులో వెలుగుతున్న హోటల్... ఎందుకో తెలీదు సడన్‌గా కొత్త ఉత్సాహం పుట్టుకొచ్చి,"కభీ కభీ మేరే దిల్ మే ఖయాల్ ఆతా హై" రాగయుక్తంగా గొణగడం మొదలుపెట్టి విస్కీ పూనకంలోంచి గొంతెత్తి పాడి పాడి అలసిన తర్వాత ఓ తియ్యటి గొంతు... "పాట బావుంది. బాగా పాడారు, మీరు కవులా...?" చిన్న నవ్వు కలబోసి అడుగుతున్న ఆమె వంక అయోమయంగా చూశాను. — ఆకు పచ్చ రంగు పంజాబీ డ్రెస్‌లో ఇమిడిన ఒక సుందరి... అంత చలిలో షాల్ కూడా కప్పుకోకుండా. అసలు ఎవరీమె? ఆమె నవ్వింది—

"నన్ను తర్వాత చూడొచ్చు తీరిగ్గా... నా ప్రశ్నకు సమాధానం చెప్పండి."

ఆ గొంతులో నిర్భయం కొంత నేను విస్తుపోయేలా చేసింది. నేను తేరుకొని నవ్వాను—

"పాడేవాళ్ళను చూసి మీరు గాయకులా అని అడగడానికి బదులు కవులా అని ఎందుకడిగారో అర్థం కాలేదు, అంతేకాదు - నా హిందీ పాట విని తెలుగులో ప్రశ్నించడం ఇంకా అర్థం కాలేదు..."

నా విస్కీ బాటిల్, గ్లాసులు, సోడాలు అవి తీసుకొచ్చిన ప్లాస్టిక్ బాగ్స్ - పక్కన పచ్చికలో ఆమె కూలబడింది - చిరువెన్నెల చెదిరినట్టు...

"ఇలాంటి పాటలు రచయితలకు కవులలాంటివాళ్ళకి తప్ప నచ్చవ్ అని నా ప్రగాఢమైన నమ్మకం. రెండు, మీ హిందీ యాక్సంట్ విని చాలా తేలిగ్గా చెప్పొచ్చు. ఖచ్చితంగా మీరు తెలుగువారేనని..." ఆమె లాజిక్ విని నాకు నవ్వొచ్చింది—

"ఇంతకీ మీ రెవరు?" అడిగాను.

"ఎవరు అంటే?"

"అదే మీ పేరు, వృత్తి, ప్రవృత్తి, ఆసక్తి అనురక్తి..."

ఆమె నవ్వి "అవన్నీ పెద్ద ముఖ్య విషయాలను కోనుగాని, ప్రతి సంవత్సరం ఊటీ వచ్చి కొంత కాలం పాటు వుండి వెళుతూ వుంటాను" ఆమె సమాధానం అర్థం కాలేదు—

"ఇంతకీ కనీసం మీ పేరు..."

"ఇంకా ఆరు రోజులు ఇదే హోటల్లో వుంటాను... తెలుసుకోండి — నా రూమ్ నెంబర్ ఫైవ్ జీరో ఒన్... మీ రూము?"

"ఫోర్ జీరో సిక్స్" అప్రయత్నంగా సమాధానం ఇచ్చాను — ఆమె లేచి నిలబడి —

"అయామ్ వెరీ హేపీ టు మీట్ యూ" అని కొద్దిగా వంగి నా చేతిని తన చేతుల్లోకి తీసుకొని సుతారంగా నొక్కి వెళ్ళిపోయింది — నేను అలాగే చూస్తున్నాను — ఆమె చీకట్లోకి కరుగుతూంది... స్వప్నంలా...

"నా పేరు తెలుసుకోండి". ఆ మాట ఛాలెంజ్‌లా చెవుల్లో గింగుర్లు తిరుగుతోంది.

* * *

మూడు రోజులు గడిచాయి. ఈ మూడ్రోజుల్లోనూ నా కొచ్చిన పాటలు, రాని పాటలు అన్నీ పాడించుకొని ఈ ప్రపంచంలో వుండే అర్థంకాని అన్ని విషయాల గురించీ పరస్పరం చర్చించుకొని...

నాలుగో రోజు—

"తెలిసిపోయింది, మీ పేరు 'శిరీష' ..." ఉత్సాహంగా చెబుతున్న నా వంక రెండు క్షణాలు తదేకంగాచూసి నిశ్శబ్దపు రాతి గుహలో మువ్వలు తెగిపడినట్టు గలగలా ప్రతిధ్వనించి...


"అది హోటల్ రిజిస్టర్‌లో నేను రాసిన పేరు... చాలా సులువుగా తెలుసుకుంటారని నాకు తెలుసు... నేను తెలుసుకోమన్నది తల్లిదండ్రులు పెట్టిన పేరు కాదు."

"మరి...?"

"కవులు... మీకామాత్రం అర్థం కాలేదా?"

నేను తెల్లబోయినట్టు ఆమె వంక చూశాను.

"ఉదాహరణకి మీ పేరు ఏదో ఒకటి



పన్ను

తాతగారు ఆ దంపతులతో —"ఏమిటయ్యా! ఇద్దరూ ఎప్పుడూ కీచులాడుకుంటూనే వుంటారు. ఎలా సంసారం చేస్తున్నారో? అందులోకీ మేనత్త, మేనమామ బిడ్డలాయె!" అన్నారు.

భార్య "నిద్రపోయాక కీచులాడుకోమండీ."

భర్త : "నిద్ర పోయాకే కీచులాడుకుంటాం."

వాళ్ళ అబ్బిగాడన్నాడు కదా, "రెండూ కరెక్టే తాతయ్యా" అని. అదెలానోయ్ అని ఆశ్చర్యపోయారు.

అబ్బిగాడు : "అమ్మా, నాన్నా ఇద్దరూ పన్నువేశారు మీకు. మీకు కలిపికొట్టడం, తీసివేతలు వస్తే సందేహం తీరిపోతుంది."

పన్నులాడిన తాతగారు కూడా మీసాలతో నవ్వేశారు.

—యస్వీ జోగారావు

వుండొచ్చు - కాని మీ అసలు పేరు చెప్పనా...?"

"చెప్పండి."

"బాటసారి" ... చిన్న నవ్వు - సముద్రాన్ని కప్పుకున్న గులాబీలా నీలం రంగు చీరలో ఆమె 'ఆమెలాగే' ఇమిడింది — మోచేతి మలుపులో వేలాడుతున్న స్వెట్టర్ తీసివేసుకుంది. ఒక విచిత్రాన్ని చూస్తున్నట్టు చూస్తూ ఆమె కూడా నడుస్తున్నాను... అలా కాసేపు నడిచిన తర్వాత ఒకచోట ఆగి

"ఏదైనా పాడండి... వినాలని వుంది" అడిగింది. నా చెయ్యి చనువుగా తన చేతుల్లోకి తీసుకొని కదిలించింది—

"నాకూ వినాలని వుంది - నువ్వు పాడకూడదూ" అప్రయత్నంగా దొర్లిన నా ఏకవచన ప్రయోగానికి ఆమె నవ్వి "గుడ్" అంది. "ఎందుకు?" అని నేనడగలేదు — ఆమె నా చెయ్యి వదలలేదు... ఒక చెట్టు దగ్గర ఇద్దరం ఆగాం - చీకటి ముసురుకుంది - నన్నటి వెన్నెల చలి...

ఆమె గొంతు సవరించుకొని పాడడం మొదలుపెట్టింది - అదొక అద్భుతమైన గొంతు - నన్నటి పూలు గుత్తులు గుత్తులుగా శరీరాన్ని తాకుతున్న అనుభూతి... నాలో ఎక్కడో అట్టడుగున నిద్రపోతున్న ఒక అస్పష్ట భావానికి ప్రాణం పోస్తూ... చటుక్కున ఆమెను దగ్గరకు లాక్కుని - కౌగిలించు కొని - ఆమె శరీర పరిమళం తియ్యగా ఉప్పెనలా నను ముంచుతుంటే, మాగిన రేగిపళ్ళ శ్వాస నాలోకి ప్రజ్వలించి... ఒక క్షణం కాలంలోంచి రాలి పడబోతుంటే... చప్పున ఆమె విదిలించుకొంది... గడ్డ కట్టుకుపోయిన నిశ్శబ్దం... రెండు నిమిషాలు అలాగే నిలబడి ఆమె చరచరా వెళ్ళిపోయింది — నిస్సత్తువుగా నేను అక్కడే కూలబడిపోయాను, ఆ పచ్చికలో చలిలో... ఖాళీ మనసుతో కూర్చుని ఎప్పటికో లేచి బయలుదేరాను...

ఫైర్ ప్లేస్‌లో కట్టెలు వెలిగించి... విస్కీ చప్పరిస్తూ... గుండెలో బాధని... హృదయంలోకి జీర్ణించుకుంటూ.... స్నేహం దొరకడం ఎంతో అదృష్టం... పోగొట్టుకోడానికి అరక్షణం పట్టలేదు... నేరం చేసిన ఫీలింగ్ విస్కీని జయిస్తోంది... టెలిఫోన్ మోగింది... మద్రాసు నుంచి ట్రంకాల్ అయ్యుంటుంది. ఫోనెత్తాను — "హలో" అన్నాను. అవతల్నించి రెస్పాన్స్ లేదు. నిశ్శబ్దం... "హలో హలో" అని అరిచాను. సమాధానం లేదు. ఊపిరి చప్పుడు వినబడుతూంది ఎవరిదో... విసుగొచ్చి రిసీవర్ క్రెడిల్ చేసి మంట ఎగదోస్తూ కూర్చున్నాను... తలుపు మీద చిన్న చప్పుడు...

"యస్ కమిన్" చూస్తూ అన్నాను. ఈ వేళప్పుడు ఎవరొస్తారు? అర నిమిషం తర్వాత మళ్ళీ చప్పుడు... వెళ్ళి తలుపు తీశాను... గదిలో లైటు వెలుగు - ఆమె మొహం మీద జ్వలించి ... కళ్ళల్లో ప్రతిఫలించి... నిశ్చేష్టంగా చూస్తున్నాను. ఏదో పరిమళం నన్ను చుట్టబెడుతూంది - ఆమె కదిలి లోపలికొచ్చి తలుపు మూసింది - తడిదేరిన కళ్ళతో నన్ను చూస్తూ ముందుకు చేతులు చాపింది...

అంతే...

నన్ను రూపించిన అనుభవం నాలోకి మెరుపులా దిగబడి, పిడుగును కనే ప్రయత్నంలో మేఘం పడే ప్రసవవేదనా మాధుర్యంలోంచి, నా మెడను ముడుతున్న రెండు తామరతూడులు హృదయాన్ని ముడుతున్న లాలస - స్పర్శకంటే గొప్ప భాష లేదని చెప్పే రెండు అధరాల, జిహ్వల, చెక్కిళ్ళ, కళ్ళ, దేహాల, మోహాల, స్వేదాల, ఉచ్ఛ్వాస నిశ్వాసాల బహు సాగర సంగమ ప్రయత్నంలో నేను శూన్యంలోకి అనంతంగా విస్తరించుకుంటూ, నిరంతరంగా జ్వలిస్తున్న... కోట్ల గులాబీల మధ్య పతనమైన పిడుగు శబ్దం లేకుండా మత్తుగా ఒత్తిగిలి, తియ్యగా నిట్టూర్చి హృదయం లోంచి ఉదయంలోకి తొంగిచూసి నప్పుడు పచ్చిక అంచున రాత్రి తియ్యగా రాల్చిన ఆనందబాష్పం తొలి కిరణాలకి కరుగుతుంటే... ఎక్కణ్ణుంచో తీపి తీపి బాధగా, శివరంజని పల్లకిలో భూపాల రాగం...

* * *

క్షణపు గతంలోంచి ఉలిక్కిపడి లేచాను - బయటకు పరుగెత్తాను... ఫైవ్ జీరో ఒన్ రూమ్ బోయ్ క్లీన్ చేస్తున్నాడు... హౌస్‌కీపింగ్ అమ్మాయి దగ్గరుండి గది క్లీన్‌గా సర్దిస్తోంది... అక్కణ్ణుంచి రిసెప్షన్‌కి పరుగెత్తాను.

"జస్ట్ ఇప్పుడే ఖాళీ చేశారు సార్... పది నిమిషాలయింది" చెప్పాడు రిసెప్షనిస్ట్. బయటకు పరుగెత్తాను. బారులు తీరిన కార్ల మధ్య నుంచి... ఓ ఎర్ర మారుతీ కారు. బేక్ సీట్లో ఏవో పాకెట్స్ పెట్టి తలుపు వేస్తోంది - ఆయాసపడుతూ ఆమె దగ్గర ఆగి ఆమె చెయ్యి పట్టుకున్నాను... ఆమె తాపీగా కారుకి ఆనుకొని నవ్వింది - నా గుండెల్లోంచి దుఃఖంలాంటిదేదో తన్నుకొస్తోంది. నా చేతిలో ఆమె చేతిని బిగించి "నువ్వు వెళ్ళొద్దు" నా గొంతులో వణుకు నాకు స్పష్టంగా తెలుస్తోంది — ఆమె తన చేతిని విడిపించుకొని డ్రైవింగ్ సీట్లో కూర్చుంది — నాకు పిచ్చెక్కేటట్టుగా వుంది.

"అసలు నువ్వెవరు?" ఓడిపోయినట్టు అడిగాను. ఆమె నా మొహంలోకి చూసి నవ్వి, నా చేతి మీద చేయి వేసి "ఇంత పంచుకున్న తర్వాత కూడా అర్థం కాలేదా నా పేరేవిటో..." చెయ్యి తీసి ఇగ్నీషన్ తిప్పింది. కారు స్టార్టయింది.

"మనం... మనం... మళ్ళీ ఎప్పుడు కలుసుకుంటాం" పిచ్చిగా అడిగాను.

"నా పేరు నీకు తెలిసిన తర్వాత" కారు కదిలింది. చెయ్యి వెనక్కి తీసుకున్నాను —

కారు వెళ్ళిపోయింది — నెమ్మదిగా వెనక్కి తిరిగాను... నా జుట్టులో ఏదో చిక్కుకున్నట్టు అనిపించి చేత్తో తడిమి తీశాను... ఓ చిన్న తొలి పువ్వు. అమాయకంగా, జాలిగా దాన్ని చూస్తుంటే చటుక్కున అర్థమైంది — ఆమె పేరేమిటో — ఆనందంగా అరవబోయాను — అప్పటికే — కారు కనుమరుగైపోయింది —

ఆ కోయిల పాటలో విషాదం లేదుగానీ... ఏదో బరువుంది. నిరీక్షణతో ఆ పాట కాలిపోవడం మొదలయింది—

అంకితం 'ఆమె'కి

## చిరునవ్వు

హృదయ పద్మం వికసించగా
ఆహ్లాద లత చిగురించగా
ధవళ కాంతి వెలుగు చూపింది
అదే చిరునవ్వు
అధరాన ప్రభవించిన పువ్వు!

మాటలు అర్థం కానివేళ
చిరునవ్వు జీవభాష
ప్రాంతాలు వేరైన సమయాన
చిరునవ్వు మహావారధి
చిరునవ్వు నవ్వనివాడు
చిరుత మనసు గలవాడు

వివాహ పూర్వం
హేమంతంలో నీరెండ
ప్రేయసి చిరునవ్వు.

వివాహానంతరం
వడివేసవిలో చలివేంద్రం
ఇల్లాలి చిరునవ్వు.

ఆప్యాయతా సౌధానికి
చిరునవ్వు నిచ్చెన
అది సర్వజనాహ్లాదిని!

మనిషి ఆరోగ్యానికేగాక
మందిలో తిరిగేందుకు సైతం
పనికివచ్చే వరమౌషధం
జన్మసేయి మందహాసం!

— చల్లా రాధాకృష్ణ శర్మ